# నమస్తే తెలంగాణ
# ఖమ్మం
5 | ఖమ్మం, మంగళవారం 23 జూలై 2024 | KHAMMAM




## నిండిన ప్రాజెక్టులు..

కిన్నెరసాని పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులకు గాను ప్రస్తుతంగా 402.8 అడుగుల మేర నీటితో నిండి ఉంది. 14 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా.. రెండు గేట్లు తెరిచి 6 వేల క్యూసెక్కులను దిగువకు వదిలారు. కిన్నెరసాని వాగులోకి కూడా భారీగా వరద రావడంతో లోతట్టు ప్రాంతాలకు నీరు చేరింది. తాలిపేరు ప్రాజెక్టు నుంచి మూడు రోజులుగా మొత్తం 25 గేట్లను ఎత్తి పూర్తిస్థాయి నీటిని కిందకు వదులుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి 74 మీటర్లు కాగా.. ప్రస్తుతం 70.74 మీటర్ల వద్ద ఉంది. తాలిపేరు నుంచి 49,574 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. దీని పరీవాహకంలోని కొత్తపల్లి, దండుపేట గ్రామాలు జలదిగ్బంధంలో ఉండడంతో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు. దుమ్ముగూడెం మండలంలో సున్నంబట్టి గ్రామం ఇంకా జలదిగ్బంధంలోనే ఉంది. గుబ్బలమంగి వాగు పొంగి ప్రవహించడంతో ఆ గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రాత్రికి 51 అడుగులకు గోదావరి వస్తే చర్ల నుంచి భద్రాచలం వైపు రాకపోకలు పూర్తిగా బంద్ అయ్యే ప్రమాదం ఉంది.



కిన్నెరసాని రెండు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

# ఉప్పొంగిన గోదావరి

- భద్రాచలం వద్ద పోటెత్తుతున్న వరద
- రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- 49 అడుగులకు చేరిన ప్రవాహం
- రాత్రికి మరింత పెరిగే ప్రమాదం
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- సమీక్షలో మంత్రి పొంగులేటి



భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 22 (నమస్తే తెలంగాణ) : ఎగువన కురుస్తున్న భారీ వర్షాల వల్ల భద్రాచలం వద్ద గోదావరి వరద పొంగి ప్రవహిస్తోంది. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాజెక్టుల్లోని నీరు కూడా దిగువకు విడుదలవుతోంది. దీంతో ప్రవాహం మరింత పెరుగుతోంది. జిల్లాలోని కిన్నెరసాని, తాలిపేరు ప్రాజెక్టులు కూడా నిండడంతో అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. భద్రాచలం వద్ద సోమవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు వరద ఉధృతి క్రమేపీ పెరుగుతూ వచ్చింది. మధ్యాహ్నం 2 గంటలకు అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. సాయంత్రం 5 గంటలకు రెండో ప్రమాద హెచ్చరిక దాటి 48.80 అడుగులకు చేరుకుంది. రాత్రి 10గంటలకు 50.01 అడుగులకు చేరింది. ఈ రాత్రికి మరింత పెరిగే ప్రమాదం ఉన్నందున మూడో ప్రమాద హెచ్చరికను కూడా జారీ చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. భద్రాచలం నుంచి 14,26,684 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోంది.

### అప్రమత్తంగా ఉండాలి: మంత్రి పొంగులేటి

భద్రాచలం వద్ద గోదావరి ఉప్పొంగడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రాద్రి జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం భద్రాచలం వచ్చిన ఆయన.. తొలుత కరకట్ట పనులను పర్యవేక్షించారు. తరువాత వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వరద సమీక్షలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే రెండు ప్రమాద హెచ్చరికలు జారీ చేశామని అన్నారు. ఏ సమయంలో వరద ప్రవాహం పెరిగినా ఎక్కడా ఎవరికీ నష్టం జరుగకుండా అధికారులు స్థానికంగా ఉండి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని, ఆహారం అందించాలని సూచించారు. కరకట్ట పైభాగానికి సందర్శకులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, ఆర్డీవో దామోదర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### రెండో ప్రమాద హెచ్చరిక జారీ: కలెక్టర్

భద్రాచలం వద్ద సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు గంటలకు నీటి ప్రవాహం 48 అడుగులకు చేరుకోవడంతో రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేసినట్లు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. గోదావరి నుంచి 11,44,645 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతున్నట్లు చెప్పారు. ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా ఇళ్ల నుంచి బయటికి రావొద్దని సూచించారు. అత్యవసర సేవలకు కంట్రోల్ రూమ్ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.



భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రవాహం



బూర్గంపహాడ్-సోంపల్లి రోడ్డు మీదకు చేరిన వరద



పర్ణశాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

## తీర గ్రామాలను చుట్టుముడుతున్న గోదావరి



తాలిపేరు ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న వరద

చర్ల, జూలై 22 : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చర్ల మండలంలోని కొండ వాగులు, చెరువులు పొంగుతున్నాయి. పలు గ్రామాల నుంచి మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి తీర ప్రాంత గ్రామాలైన దండుపేట, కొత్తపల్లి, లింగాపురం, గొంపల్లి, కొత్తూరు, మొగళ్లపల్లి, చింతకుంట, వీరాపురం, తేగడ, మేడువాయి గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గోదావరి పోటెత్తడంతో చర్ల సమీపంలోని ఈతవాగు గొంపల్లి, లింగాపురం, కొత్తపల్లి, దండుపేట గ్రామాలను వరద చుట్టుముట్టింది. రాకపోకలు నిలిచిపోయాయి. పూసుగుప్ప, ఉంజిపల్లి, వద్దిపేట, బత్తినపల్లి ఆదివాసీల గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పైనుంచి కొండవాగులు ప్రవహిస్తున్నాయి.

## దుమ్ముగూడెం హెడ్ లాకుల వద్ద 24.2 అడుగులు..



దుమ్ముగూడెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

దుమ్ముగూడెం, జూలై 22 : దుమ్ముగూడెం హెడ్ లాకుల వద్ద సోమవారం సాయంత్రానికి గోదావరి నీటిమట్టం 24.2 అడుగులకు చేరుకుంది. గంగోలు, రేగుబల్లి, తూరుబాక గ్రామాల వద్దకు, ప్రధాన రహదారి మీదకు వరదనీరు చేరింది. మరో మూడు అడుగుల మేర నీటిమట్టం పెరిగితే భద్రాచలం-చర్ల ప్రధాన రహదారిపైకి కూడా వరద వచ్చే ప్రమాదం ఉంది.



పాల్వంచ రూరల్: గర్భిణులను తీసుకొచ్చేందుకు వాగుదాటి వెళ్తున్న వైద్యాధికారులు



చర్ల: చెరువు అలుగులో చేపలు పడుతున్న గ్రామస్తులు

- రూ.60 వేలలోపు మాత్రమే మంజూరు ఏమిటి?
- బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్
- రూ.16 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

# చెక్కుల జారీలో జాప్యం సరికాదు

ఖమ్మం, జూలై 21 : సీఎంఆర్ఎఫ్ చెక్కుల జారీలో జాప్యం సరికాదని, రూ.60 వేలలోపు మాత్రమే మంజూరు చేయడం ఏమిటని బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ప్రశ్నించారు. తన సిఫార్సు ద్వారా మంజూరైన రూ.16 లక్షల విలువైన చెక్కులను సోమవారం నగరంలోని తెలంగాణ భవన్‌లో బాధిత కుటుంబాలకు ఎమ్మెల్సీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం బారినపడి అవస్థ పడుతున్న నిరుపేదలకు సీఎం సహాయ నిధి ద్వారా కొంత వెసులుబాటు కల్పించడానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ లక్షలాది చెక్కులను విడుదల చేశారని గుర్తు చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం విడుదల చేసిన చెక్కులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందించడం లేదంటే వారి పని తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. కేవలం రూ.60 వేలకు మించి ప్రభుత్వం మంజూరు చేయడం లేదన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో అర్హులైన నిరుపేదలకు రూ. 5 లక్షల పైచిలుకు వైద్య ఖర్చులను అందించామన్నారు. నాటి కేసీఆర్ ఫొటోతో విడుదల చేసిన చెక్కులను నేటి సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోతో విడుదల చేసేందుకు వందలాది మందికి చెక్కులను పంపిణీ పెండింగ్‌లో పెట్టారని ఆయన ఆరోపించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంజూరైన చెక్కులను బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వేదికగా పంపిణీ చేసేందుకు తన సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో టీ సీడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, రూరల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్, వీరన్న, పోట్ల శ్రీను, అప్పారావు, పగడాల నరేందర్, ఉమాశంకర్, లింగన్న, బోయిన సతీశ్, ధనుంజయ్, విజయ్, సద్దాం, ఫిరోజ్, దినేష్ పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

# టీచర్ల కోసం విద్యార్థుల రాస్తారోకో

- డీఈవో హామీతో ఆందోళన విరమణ

కూసుమంచి, జూలై 22 : పాలేరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు ఉన్నా.. నలుగురు ఉపాధ్యాయులే ఉండడంతో తమకు పూర్తిస్థాయిలో టీచర్లను నియమించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు సోమవారం పాఠశాలకు తాళం వేసి రోడ్డెక్కి ఆందోళన చేశారు. సూర్యాపేట-ఖమ్మం ప్రధాన రహదారిపై విద్యార్థులు రాస్తారోకో చేయడంతో వారికి విద్యార్థి సంఘాలు, స్థానిక నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గతే ఏడాది పాఠశాల అప్‌గ్రేడ్ కావడంతో పదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారని, అప్పుడు టీచర్ల కొరత ఉంటే వలంటీర్లను పెట్టి నడిపించారని గుర్తు చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 247 మంది విద్యార్థులున్నా.. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేకపోవడంతో చదువులు ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 40 మంది ఉన్న పాఠశాలలో 247 మంది విద్యార్థులు చేరినా ఉపాధ్యాయులను ఎందుకు నియమించడం లేదని ప్రశ్నించారు. వెంటనే ఉపాధ్యాయులను నియమించి తరగతులు సక్రమంగా జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఎంఈవో రామాచారి.. డీఈవో సోమశేఖర శర్మ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన రెండు రోజుల్లో డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను నియమిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.



పాలేరులో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

# కొర్రీలు లేకుండా రుణమాఫీ చేయాలి

- గానుగపాడు సొసైటీ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి బీఆర్ఎస్ నిరసన



సొసైటీ చైర్మన్ చందర్‌రావుకు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

చండ్రుగొండ, జూలై 22 : కొర్రీలు, నిబంధలు పెట్టకుండా రుణం తీసుకున్న రైతులందరికీ బేషరతుగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండలోని గానుగపాడు సొసైటీ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ గానుగపాడు సొసైటీలో 2,500 మంది రైతులు ఉంటే.. 500 మంది రైతులకు, గుంపెన సొసైటీలో 1,800 మంది రైతులకు రూ.లక్షలోపు రుణాలు ఉంటే.. 300 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీలు, బ్యాంకుల్లో రుణం తీసుకున్న అందరు రైతులకు బేషరతుగా రుణమాఫీ చేయాలని, లేదంటే రైతులతో కలిసి ఉద్యమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సొసైటీ చైర్మన్ చెవుల చందర్‌రావు, సీఈవో లంక నర్సింహారావులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు భూపతి రమేశ్, కన్నయ్య, తుపాకుల రాజు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# 'పెదవాగు'ది తీరని నష్టం

- తక్షణ సహాయ చర్యల కోసం రూ.8.50 కోట్లు మంజూరు
- ఇసుక మేటల తొలగింపునకు ఎకరానికి రూ.10 వేలు
- పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ల స్థానంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు
- 'ట్రస్ట్' ద్వారా గుడిసెలకు రూ.10 వేలు, ఆర్‌సీసీలకు రూ.5 వేలు
- అశ్వారావుపేట పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పెదవాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

అశ్వారావుపేట టౌన్, జూలై 22: పెదవాగు ప్రాజెక్టు కట్ట తెగిపోవడం తీరని నష్టమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విచారం వ్యక్తం చేశారు. 1989లో కూడా ఒకసారి ఈ ప్రాజెక్టుకు గండి పడినందున ఆ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు సకాలంలో స్పందించి ఉంటే ఇంతటి ప్రమాదం వాటిల్లేది కాదని అన్నారు. తక్షణ సహాయ చర్యల కోసం సీఎం రేవంత్‌రెడ్డి రూ.8.50 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. పూర్తిగా నష్టం వాటిల్లిన ఇళ్లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. మండలంలోని గుమ్మడివల్లి సమీపంలో ఉన్న పెదవాగు ప్రాజెక్టు ఇటీవల తెగి ఆయకట్టు రైతులు, స్థానిక ప్రజలు తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో ఆయా గ్రామాల్లో మంత్రి పొంగులేటి సోమవారం పర్యటించారు. జిల్లా అధికారులతో కలిసి వెళ్లి అటు తెగిపోయిన ప్రాజెక్టు, కొట్టుకుపోయిన పంటలు, ఇసుక మేటలు వేసిన పొలాలు, దెబ్బతిన్న ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి మాట్లాడారు. వరద వచ్చినప్పుడు క్షేత్రస్థాయి అధికారులు సకాలంలో స్పందించి ప్రాజెక్టు మూడు గేట్లను తెరిచి నీటిని విడుదల చేసి ఉంటే నష్టం ఇంతలా ఉండేది కాదని అన్నారు. పెదవాగు ప్రాజెక్టు ఆయకట్టు పక్కనే ఉన్న ఏపీలోనే ఎక్కువగా ఉందని అన్నారు. అయినప్పటికీ ఈ ప్రాజెక్టుపై ఆ రాష్ట్రం శ్రద్ధ చూపలేదని ఆరోపించారు. ప్రజలెవరూ అధైర్య పడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రాజెక్టు పునర్నిర్మాణాన్ని చేపడతామని అన్నారు.

### 400 ఎకరాల్లో ఇసుక మేటలు..

ప్రాజెక్టు కట్ట తెగిపోవడంతో 400 ఎకరాల్లో ఇసుక మేటలు వేసిందని, ఫలితంగా రైతులకు తీరని నష్టం వాటిల్లిందని మంత్రి తెలిపారు. పొల్లాల్లో ఇసుక మేటలను తొలగించేందుకు ఎకరానికి రూ.10 వేల చొప్పున రైతులకు అందజేస్తామన్నారు. మృతిచెందిన, కొట్టుకుపోయిన గేదెలు, ఆవులకు ఒక్కోదానికి రూ.20 వేల చొప్పున, గొర్రెలు, మేకలకు రూ.3 వేల చొప్పున ఇస్తామని ప్రకటించారు. విద్యుత్, ఆర్‌అండ్‌బీ శాఖలకు సుమారు రూ.8.50 కోట్లను తక్షణ మరమ్మతుల కింద ముఖ్యమంత్రి మంజూరు చేసినట్లు తెలిపారు. పెదవాగు విస్తీర్ణం 1100 ఎకరాలు ఉందని అన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి ఆక్రమణలను గుర్తించాలని ఆదేశించారు. అధికారుల నిర్లక్ష్యంపై విచారణ చేపడతామని, అందులో అధికారుల తప్పిదముందని తేలితే శిక్ష తప్పదని స్పష్టం చేశారు.

### 'పొంగులేటి' ట్రస్ట్ ద్వారా సాయం..

పెదవాగు ముంపు కారణంగా నష్టపోయిన వారికి పొంగులేటి రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. నీటమునిగిన పూరి గుడిసెలకు రూ.10 వేలు, ఆర్‌సీసీ స్లాబ్ ఇళ్లకు రూ.5 వేల చొప్పున సాయంగా అందిస్తామని తెలిపారు. ముగ్గురు మంత్రులము ఉన్నామని, తప్పక ఆదుకుంటామని అన్నారు. భద్రాద్రి కలెక్టర్ జితేశ్, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.